
# రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం

## జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**చేర్యాల, మే 8 (సిరి న్యూస్) :**

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాడుతానని, నియోజక వర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చేర్యాల, కొముంవెల్లి మండలాలకు చెందిన 19 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను విజయం సాధించినప్పటి నుంచి ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా నీలిమా దవాఖానలో ఉచితంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి క్షతగాత్రులకు, బాధితులకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో అన్ని గ్రామాల్లోని చెరువులు నింపేందుకు తాను తీవ్రంగా కృషి చేస్తున్నానని, ఇటీవల దేవన్నపేట పంపుహౌస్‌ను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి సందర్శించినప్పుడు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపడంతో కలిగే ప్రయోజనాలతో పాటు మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ వరకు రూ.300 కోట్లతో ప్రారంభించిన కాల్వ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని మంత్రులను కోరినట్లు తెలిపారు. దేవాదుల కాల్వల నిర్మాణం, భూసేకరణ, నిర్వాసితులకు అందించాల్సిన నష్టపరిహారం తదితర అంశాలను మంత్రుల సమీక్షలో లేవనెత్తినట్లు తెలిపారు. చేర్యాలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నానని, సంబంధిత శాఖల అధికారులు సైతం సకాలంలో ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవనం, ప్రభుత్వ దవాఖాన భవనాల పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. అనంతరం మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన పోగుల శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అంతకు ముందు మండలంలోని కమలాయపల్లి మాజీ సర్పంచ్ ఒరుగంటి అంజయ్య కుమారుడు వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరై ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, తలారి కిషన్, మంగోలు చంటి, బీరెడ్డి ఇన్నారెడ్డి, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి,జింకల పర్వతాలుయాదవ్, మంచాల కొండయ్య, బూరగోని తిరుపతిగౌడ్, గదరాజు యాదగిరి, బొడిగం మహిపాల్‌రెడ్డి, ఎలికట్టె శివశకంర్, అరిగే కనకయ్య, ఆకుల రాజేశ్ గౌడ్, ఎర్రోల్ల యాదగిరి, బంగారిగల్ల కిరణ్‌కుమార్, రాము, పచ్చిమడ్ల చిన్న పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**మెదక్ , మే 08 సిరి న్యూస్ః**




జూన్ 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేలా కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి శుభవల్లి అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ మేనేజర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ%ొ%రాజీ మార్గమే రాజమార్గమని, పోలీసులు సమన్వయంతో పనిచేసి ఎక్కువ సంఖ్యలో కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రజలు, కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి సిరిసౌజన్య, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల తోనే భూసారం పెరుగుతుంది : డాక్టర్ శ్రీదేవి

**తొగుట, మే 8 సిరి న్యూస్ః**



రైతులు వ్యవసాయ భూముల్లో రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడడంతో భూసారం పెరిగి పంటలు అధిక దిగుబడి వస్తుందని డాక్టర్ ఎస్ శ్రీదేవి అన్నారు. బుధవారం తొగుట మండలంలోని గుడికందుల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఎస్ శ్రీదేవి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వాడకం నేల సంరక్షణ చర్యలను రైతులు తీసుకోవాలని సూచించారు. పంటల మార్పిడి వల్ల పంటలకు తెగుళ్లు రాకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమాదేవి, ఉమారాణి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి

**సదాశివపేట, మే 8 (సిరి న్యూస్)**



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం నిలిపివేయాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ గురువారం నాడు కలెక్టర్ కు మెమొరండం ఇచ్చారు. సదాశివపేట పట్టణ పరిధిలోని ఈదుల వాగు సమీపంలో గల సర్వేనెంబర్ 590 /1/2/1 అసైన్డ్ పట్టా గల వ్యవసాయ భూమిలో అక్రమ కట్టడం నిర్మించి అట్టి నిర్మాణాన్ని కమర్షియల్ గా అద్దెకు ఇచ్చి డబ్బులు అర్జిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని ఆ యొక్క కట్టడాన్ని తొలగించడమే కాకుండా రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ కు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింత గోపాల్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేత మునిపల్లి సత్యనారాయణ అసైన్ పట్టా వ్యవసాయ భూమి లో అక్రమ కట్టడాలు కట్టడమే కాక కమర్షియల్ గా లాభం పొందుతున్నాడని దీనిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందులో బిఆర్ఎస్ నాయకులు శివరాజు పాటిల్, కళింపటేల్, వీరేశం, మోబిన్, అవినాష్, శమీ, నసిరుద్దీన్, సత్యనారాయణ, నాని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన జర్నలిస్టులు

**సంగారెడ్డి, మే 8 ( సిరి న్యూస్ )**



సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సాయినాథ్ మాట్లాడుతూ.. ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో కలిసి పనిచేద్దామని, తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులపై ఏదైనా ఫిర్యాదులు వస్తే, పూర్తిస్థాయి విచారణ చేసిన తర్వాతే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఎస్పీని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు ఎర్ర వీరేందర్ గౌడ్, వసంత్ కుమార్, సునీల్ లో ఉన్నారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

**వెల్దుర్తి, మే 8 సిరి న్యూస్ః**

మాసాయిపేట మండల పరిధిలోని హల్దీ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రాజెక్టులో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం.. ప్రకారం వెల్దుర్తి మండలం చర్లపల్లి పంచాయతీ వర్ధవాని చెరువు తండాకు చెందిన కెతావత్ గోపాల్ (30) గురువారం ఉదయం ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులతో పాటు వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించారు. వెల్దుర్తి పోలీసులు ప్రాజెక్ట్ వద్దకు చేరుకొని ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో మృతదేహం కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా ప్రాజెక్ట్ వద్దకు చేరుకొని మృతి దేహం కోసం గాలిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.